క్లుప్తంగా

అమరచింత ఎస్‌ఐగా జగన్మోహన్



అమరచింత: నూతన ఎస్‌ఐగా జగన్మోహన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. నారాయణపేట జిల్లా కేంద్రంలో స్పెషల్ బ్రాంచి ఎస్‌ఐ విధులు నిర్వహించిన ఆయన అమరచింతకు ఎస్‌ఐగా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాంతి భద్రతల వ్యవహారంలో ప్రజలు పూర్తిగా పోలీసులకు సహకరించాలని కోరారు. కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నాయకులు నూతన ఎస్‌ఐని కలిసి శాలువాతో సన్మానించారు.

క్రీడల్లో రాణించాలి



ఆత్మకూర్: క్రీడాకారులు గ్రామీణ ప్రాంతాలకే పరిమితం కాకుండా జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలని మదనాపురం తహసీల్దార్ నరేందర్, భీమా కాల్వ ఏఈ శివానంద్, శృతి జ్యువెల్లర్స్ అధినేత గాడీ లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని మినీ స్టేడియంలో వేసవి శిబిరంలో వాలీబాల్, ఫుట్‌బాల్ క్రీడల్లో శిక్షణ పొందిన క్రీడాకారులకు సోమవారం సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో కోచ్ ఖాదర్, సీనియర్ క్రీడాకారులు మురళి, నరేందర్, దివాకర్, బాలు, నర్సింహ, తోట రవి, వాహబ్, క్రీడాకారులు పాల్గొన్నారు.

అసత్య ప్రచారాలొద్దు

పెబ్బేరు: మండలంలోని కంచిరావుపల్లికి చెందిన బీఎస్పీ నాయకులు ఆదివారం బీఆర్‌ఎస్‌లో చేరినట్లు అబద్ధపు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని నాయకులు తెలిపారు. జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో కంచిరావుపల్లికి చెందిన బహుజన సమాజ్ పార్టీ నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరినట్లు ప్రచారం చేయడం సరికాదు. బీరు, బిర్యానీ, పదవులకు, డబ్బులకు ఆశపడి లొంగేవారు బహుజనులు కారని, మరోసారి ఇలాంటి తప్పుడు ప్రచారం చేస్తే తగ్గిన బుద్ధి చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఘనపురం కృష్ణ, రమేష్, రామచందర్, అరుణ్‌కుమార్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

గణేష్‌గౌడ్‌పై చర్యలు తీసుకోవాలి

గోపాల్‌పేట: కాంగ్రెస్ మండల నాయకుడు గణేష్‌గౌడ్‌పై కేసులు నమోదు అవుతున్నా రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ చిన్నారెడ్డి అతడిపై ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని బీఆర్‌ఎస్ నాయకులు ప్రశ్నించారు. సోమవారం మండల కేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడుతూ.. గణేష్‌గౌడ్‌పై కొన్నాళ్ల క్రితం బెంగుళూరులో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో కేసు నమోదు చేసిందని, అందులో ఏ7 నిందితుడిగా ఉన్నాడని ఆరోపించారు. మాదక ద్రవ్యాల కేసులో నిందితుడిగా ఉన్న వ్యక్తిని తన అనుచరుడిగా పెట్టుకుని చిన్నారెడ్డి ఏం చేస్తున్నాడన్నారు. వెంటనే అతడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుబంధు మండల అధ్యక్షుడు తిరుపతి యాదవ్, మండల అధ్యక్షుడు కోదండం, తాడిపర్తి మాజీ సర్పంచ్ లోకారెడ్డి, నాయకులు కోటిరెడ్డి, రాము, తాడిపర్తి మాజీ ఎంపీటీసీ కృష్ణయ్య, గౌతం, మతీన్, నాగరాజు, రాజేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

జూరాల కాల్వలో ట్రాక్టర్ బోల్తా



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని జూరాల ప్రధాన కాల్వలో సోమవారం ట్రాక్టర్ బోల్తాపడి డ్రైవర్ ఉప్పరి విజయ్ తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాలలో.. రంగాపూర్ గ్రామానికి చెందిన ఉప్పరి విజయ్ పట్టణంలోని సంత బజార్‌లో నివాసం ఉంటూ.. సోమవారం తన ట్రాక్టర్‌తో కంచిరావుపల్లిలో వ్యవసాయ పనులు ముగించుకొని తిరిగి జూరాల కాల్వ రోడ్డుపై వస్తున్న క్రమంలో ట్రాక్టర్ అదుపు తప్పి కాల్వలోకి దూసుకుపోయింది. దీంతో అక్కడే ఉన్న యువకులు భానుప్రకాష్, పురుషోత్తం, రవి మరికొంత మంది కలిసి డ్రైవర్ విజయ్‌ను రక్షించారు. అనంతరం చికిత్స కోసం 108 అంబులెన్స్‌లో వనపర్తి ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ జగదీష్ తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

వనపర్తి: స్వీపర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఏఐటీసీయూ జిల్లా కార్యదర్శి మోష డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ధర్నాచౌక్‌లో స్వీపర్లు చేస్తున్న రిలేదీక్షకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రస్తుతం స్వీపర్లుగా పని చేస్తున్న వారిలో కొందరికి ఒకలా.. మరికొందరికి మరోలా.. వేతనాలు ఇస్తూ అవమానాలకు గురిచేస్తున్నారని ఆయన ఆరోపించారు.

భక్తిశ్రద్ధలతో అమావాస్య పూజలు

ఆత్మకూర్: అభయ ఆంజనేయస్వామి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకుని సోమవారం ప్రముఖ వేదపండితుడు గోపాలకృష్ణమూర్తి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండలంలోని బాలకిష్టపూర్ శివారులోని ఆంజేయస్వామి ఆలయంలో వైస్‌ఎంపీపీ కోటేష్ దంపతులు భక్తులకు అన్నదానం నిర్వహించారు. ప్రతినెలా అమావాస్య సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించేందుకు కమిటీ నిర్ణయించినట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బంగారు శ్రీను, మాజీ ఎంపీపీ శ్రీధర్‌గౌడ్, విండో అధ్యక్షుడు లక్ష్మీకాంత్‌రెడ్డి, శృతి జ్యువెల్లర్స్ అధినేత గాడి లక్ష్మీనారాయణ, గాడి అరుణ, సర్పంచ్ తుకరాంనాయక్, మాజీసర్పంచ్ సత్యన్న, నిర్వాహకులు చిరంజీవీ, మానన్న, చంద్రయ్య, భక్తులు పాల్గొన్నారు.

అమరచింత: మండలంలోని ప్రధాన ఆలయాల్లో అమావాస్యను పురస్కరించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. నాగల్‌కడ్మూర్‌లోని దేవేంద్రచార్యుల మఠంలో పూజలతో పాటు ఆలయానికి వచ్చిన భక్తులకు అన్నదానం చేశారు. పట్టణంలోని శివచౌడేశ్వరి ఆలయం, వేంకటేశ్వర ఆలయంతో పాటు పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తులకు అన్నదానం చేశారు.

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని వీరన్న గుట్టపై వెలిసిన భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయంలో అమావాస్యను పురస్కరించుకొని సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. నిర్వాహకుడు కమ్మరి గోపి ఆధ్వర్యంలో ఉదయం దేవాలయంలో స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం గుట్ట కింది భాగాన అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన భక్తులు పూజల్లో పాల్గొని స్వామివారికి మొక్కులు చెల్లించుకున్నారు.



శ్రీరంగాపురంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని వీరంపేట, మిట్ట ఆంజనేయస్వామి, వేణుగోపాలస్వామి ఆలయాల్లో స్వామివారికి సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు అన్నదానం చేశారు. దాతలు అల్వాల సత్యన్నగౌడ్, బుసిరెడ్డి శివప్రసాద్ రెడ్డిని ఆలయ కమిటీ సభ్యులు శాలువాలతో ఘనంగా సన్మానించారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం మండల కేంద్రంలోని ఆదిబసవన్న ఆలయం, ఆంజనేయస్వామి ఆలయంలో సోమవారం అమావాస్య పర్వదినాన్ని పురస్కరించుకొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సూగూరులో చౌడేశ్వరి అమ్మవారి జయంతి సందర్భంగా అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పెదికోట్ల బ్రదర్స్ కుటుంబ సభ్యులు భక్తులకు అన్నదానం, తీర్థ ప్రసాదాలను అందించారు.



బాలకిష్టాపూర్‌లో పూజల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు



ఖిల్లాఘనపురం వీరభద్రస్వామి ఆలయం వద్ద..



నాగల్‌కడ్మూర్‌లో..



పెబ్బేరులో..

హామీల అమలులో విఫలం



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు

పాన్‌గల్: ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో ప్రభుత్వం విఫలమైందని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కళావతమ్మ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో పార్టీ నాయకులతో కలిసి ఆమె విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గత ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన రూ.లక్ష రుణమాఫీ, డబుల్‌బెడ్‌రూం ఇళ్లు, దళితులకు మూడెకరాల భూపంపిణీ, ఉద్యోగాల భర్తీ, నిరుద్యోగ భృతి వంటి హామీలు అమలు కాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. రానున్న ఎన్నికల్లో కేసీఆర్ ప్రభుత్వం గెలిచేందుకు మళ్లీ హామీలు ఇస్తారని వాటిని నమ్మే స్థితిలో ప్రజలు లేరన్నారు. దళితబంధు, రెండో విడత గొర్రెల పంపిణీ కోసం డీడీలు చెల్లించి లబ్ధిదారులు ఎదురుచూస్తున్నారని, నూతన రేషన్ కార్డులు, పేదలకు ఇళ్ల స్థలాల పంపిణీ వంటి సమస్యలను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో శ్రీరామ్, బాలస్వామి, కుర్మయ్య, పెద్ద హన్మంతు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దిగొచ్చే వరకు ఉద్యమిస్తాం

వనపర్తి: పంచాయతీ కార్మికుల సమస్యలపై ప్రభుత్వం దిగొచ్చే వరకు ఉద్యమిస్తామని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రాధాకృష్ణ స్పష్టం చేశారు. 12వ రోజుకు చేరుకున్న కార్మికుల నిరవధిక సమ్మె శిబిరాన్ని సోమవారం ఆయన సందర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోపాలకృష్ణ, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలంటూ 12రోజులుగా కార్మికులు సమ్మె చేపడుతున్నా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తుందని, ప్రభుత్వం దిగి వచ్చి చర్చలు జరిపి కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సూర్యం ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సోమవారం కొత్తకోట మండల పరిషత్ కార్యాలయం ఎదుట కార్మికులు చేపడుతున్న సమ్మెకు ఆయన మద్దతు తెలిపారు. కార్యక్రమంలో నిక్సన్, కరీం, గోపాల్, బొజ్జన్న, నగేష్, రాములు, సహదేవుడు, భాస్కర్ తదిరతులు ఉన్నారు.



కొత్తకోటలో మాట్లాడుతున్న సూర్యం

పాన్‌గల్: కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం సానుకూలతతో పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కళావతమ్మ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మెకు సోమవారం వారు మద్దతు ప్రకటించారు. కార్యక్రమంలో రాము తదితరులు పాల్గొన్నారు.

యువకుడి అదృశ్యం



ఆత్మకూర్: వ్యవసాయ పనులు చూసుకోవాలని తండ్రి కుమారుడిని మందలించడంతో ఓ యువకుడు ఇంటి నుంచి వెళ్లి కనిపించకుండా పోయిన ఘటన మండలంలో చోటుచేసుకుంది. ఎస్‌ఐ నరేందర్ తెలిపిన వివరాలు ప్రకారం.. మండలంలోని తిప్పడంపల్లికి చెందిన గొల్ల కురుమూర్తి వనపర్తికి వెళ్లి డ్రైవింగ్ చేసుకుంటానని తండ్రి తిరుపతయ్యతో చెప్పాడు. తమకున్న వ్యవసాయం పనులు చేసుకోవాలని, ఎక్కడికి వెళ్లేది లేదని తండ్రి సూచించడంతో ఈ నెల 11వ తేదీన ఇంటి నుంచి వెళ్లిపోయాడని, సెల్‌ఫోను స్విచ్ ఆఫ్‌లో ఉందని తండ్రి తెలిపారు. బంధువులు, తెలిసిన వారి వద్ద ఆరా తీసిన ఆచూకీ లభించకపోవడంతో సోమవారం తండ్రి ఫిర్యాదు చేశారన్నారు. ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని, వివరాలు తెలిసిన వారు పోలీసులకు సెల్‌నం 87126 70631 నంబరుకు సమాచారం ఇవ్వాలని ఎస్ కోరారు.

సెల్‌ఫోన్ అప్పగింత



ఆత్మకూర్: నూతనంగా వచ్చిన సీఈఐఆర్ పోర్టల్ ద్వారా చోరీకి గురయిన సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి సోమవారం బాధితుడికి అప్పగించినట్లు ఎస్‌ఐ నరేందర్ తెలిపారు. పట్టణంలోని పీజేపీ క్యాంపులో నివాసం ఉంటున్న వెంకటస్వామి నెల రోజుల క్రితం ఆత్మకూర్ సంతలో తన సెల్‌ఫోన్ చోరీకి గురయ్యిందని పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సెల్‌ఫోన్ ఆచూకీని నిజామాబాద్‌లో ఉన్నట్లు గుర్తించి రికవరీ చేసుకున్నారు. సెల్‌ఫోన్లు చోరీకి గురయిన, లేదా పోగొట్టుకున్నా సీఈఐఆర్ పోర్టల్ ద్వారా వివరాలను పొందుపర్చాలని సూచించారు.

రైతులను జాగృతం చేద్దాం



మాట్లాడుతున్న హనుమాన్‌రావు

మదనాపురం: బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతులకు 24 గంటలు ఉచితంగా ఇచ్చే విద్యుత్‌కు వ్యతిరేకంగా రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై రైతులను చైతన్యం చేయాలని మంత్రి కేటీఆర్ పిలుపు మేరకు సోమవారం కొన్నూర్, అజ్జకొల్లు క్లస్టర్లలో రైతులతో మండల కేంద్రంలోని రైతువేదికలో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రైతుబంధు మండల అధ్యక్షుడు హనుమాన్‌రావు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పాలనే ఆలోచనతో రైతు వేదికల్లో రైతు సమావేశాలు ఏర్పాటు చేసి సీఎం చేస్తున్న అభివృద్ధి పథకాలు గురించి అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సూచనతో 19న అజ్జకొల్లు రైతు వేదిక, 22న కొన్నూర్ రైతువేదిక, 25న మదనాపురం రైతువేదికలో సమావేశాలు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కృష్ణయ్య, ఎంపీపీ పద్మావతి, మండల అధ్యక్షుడు యాదగిరి, వడ్డె రాములు, సర్పంచ్ రాంనారాయణ, పట్టణ కమిటీ అధ్యక్షుడు బాలు, రాములుగౌడ్, తిరుపతయ్య, ధర్మారెడ్డి, రంగన్న, సత్యం యాదవ్, నాగేంద్రం తదితరులు పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు భూమిపూజ

పెద్దకొత్తపల్లి: మండల కేంద్రంలో మహాత్మా జ్యోతిరావు పూలే, మహేంద్రనాథ్ విగ్రహాల ఏర్పాటుకు ఎంపీపీ సూర్యప్రతాప్‌గౌడ్, బీజేపీ నాయకుడు రవీంద్రనాథ్‌లు సోమవారం భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదల అభ్యున్నతి కోసం కృషి చేసిన మహనీయులను మరిచిపోవద్దని సూచించారు. వారి అడుగు జాడల్లో యువత నడవాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వెంకటేశ్వర్‌రెడ్డి, సత్యం, గోపాల్‌రావు, విష్ణు, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాటవరమా.. కాకవరమా..?

అడ్డాకుల: మండలంలోని కాటవరం గ్రామానికి సంబంధించిన బోర్డును జాతీయ రహదారిపై రహదారి నిర్వాహకులు రెండు రకాలుగా ఏర్పాటు చేశారు. భూత్పూర్ వైపు నుంచి అడ్డాకులకు వెళ్లే దారిలో హైవే పక్కన ఏర్పాటు చేసిన బోర్డులో కాటవరం అని సరిగ్గానే రాయించారు. కానీ అడ్డాకుల నుంచి భూత్పూర్ వైపు వెళ్లే దారిలో సబ్ స్టేషన్ వద్ద రోడ్డు పక్కన ఉన్న బోర్డుపై కాకవరం అంటూ రాయించారు. ఊరు ఒకటే అయినా పేర్లను మాత్రం రెండు రకాలుగా ఏర్పాటు చేయించారు. వాస్తవానికి కాటవరం అని రాయించాల్సి ఉంది. గతంలో రెండు బోర్డులపై కాకవరం అని ఉండగా కొన్నాళ్ల కిందట ఒక బోర్డుపై కాటవరం అని సరి చేయించారు. మరో బోర్డుపై మాత్రం కాకవరంగానే ఉంచారు.



భూత్పూర్ వైపు వెళ్లే దారిలో..



అడ్డాకుల వైపు వెళ్లే దారిలో ..

నియోజకవర్గ అభివృద్ధికి కృషి



ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

పాన్‌గల్: కొల్లాపూర్ నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే వచ్చే ఎన్నికలల్లో బీజేపీని ఆదరించాలని బీజేపీ నాయకుడు అన్వేష్, బీజేవైఎం జిల్లా నాయకుడు రమేష్ అన్నారు. గడప, గడపకు బీజేపీ కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని కదిరెపాడు, దావాత్‌ఖాన్‌పల్లిలో ఇంటింటికీ కరపత్రాలను పంచుతూ ప్రచారం నిర్వహించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కార్యకర్తలకు సూచించారు. నియోజకవర్గంలో నాగర్‌కర్నూల్ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు నాయకత్వంలో అభివృద్ధి పనులు చేపడతామన్నారు. వచ్చే ఎన్నికల్లో బీజేపీకి ఒక్క అవకాశం ఇవ్వాలని వారు ఓటర్లను కోరారు. రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ప్రజలను చైతన్యం చేస్తూ పార్టీ బలోపేతమే ధ్యేయంగా కార్యకర్తలు పనిచేయాలన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు నాగరాజునాయుడు, జగన్‌గుప్తా, శివ, మధుసూదన్‌యాదవ్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే పేదల సంక్షేమం

అమరచింత: పేదలు కలలు కన్న రాజ్యంతో పాటు వారికి సంక్షేమ పథకాలు అందాలంటే కాంగ్రెస్ ప్రభుత్వానికే సాధ్యమవుతుందని, కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల అభివృద్ధి సాకారమవుతుందని టీపీసీసీ అధికార ప్రతినిధి కేశం నాగరాజ్‌గౌడ్ అన్నారు. యూత్ జూడో-బూత్ జూడో కార్యక్రమంలో భాగంగా మండలంలోని నాగల్‌కడ్మూర్‌లో సోమవారం ఇంటింటికీ వెళ్లి కాంగ్రెస్ పార్టీని ఆదరించాలంటూ ప్రచారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ పరిపాలన రావాలన్న రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపర్చి కేంద్రం, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని తీసుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. నిరుపేదలను అన్ని విధాలుగా ఆదుకుని వారి కుటుంబాల్లో వెలుగునింపిన ఘనత కాంగ్రెస్‌దే అని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో ఒక్క గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల కోసం స్థానిక ఎమ్మెల్యే ప్రయత్నాలు చేయట్లేదని ఎద్దేవా చేశారు. ధర్మాపురం గ్రామానికి ఇప్పటికీ రహదారి సౌకర్యం లేక ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి నేతృత్వంలో అన్ని నియోజక వర్గాలు, గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీ బలపడుతుందని తెలిపారు. కాంగ్రెస్ ఎదుగుదలను చూడలేక అధికార పార్టీ నాయకులు ఆరోపణలు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి ఆయూబ్‌ఖాన్, మహేందర్‌రెడ్డి, ప్రకాశం, పోషిరిగారి విష్ణు, శ్యామ్, తులసీరాజ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కేశం నాగరాజ్‌గౌడ్

అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దించుదాం



వీరాయపల్లిలో పర్యటిస్తున్న మేఘారెడ్డి

కొత్తకోట రూరల్: అవినీతి ప్రభుత్వాన్ని గద్దె దింపే వరకు పోరాటం చేస్తామని పెద్దమందడి ఎంపీపీ మేఘారెడ్డి అన్నారు. ఆయన పెద్దమందడి మండలంలోని వీరాయపల్లిలో పర్యటించి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు మండలంలో ఒక్క డబుల్‌బెడ్‌రూం ఇల్లు నిర్మించలేదని మండిపడ్డారు. దశాబ్ది ఉత్సవాల పేరుతో ప్రభుత్వ ఖజానాతో బీఆర్‌ఎస్ ప్రచారం చేసుకున్నారని ఆరోపించారు. రైతు వేదికలు అన్నదాతలకు సాగులో మెళకులవలు నేర్పించాలనే ఉద్దేశంతో నిర్మిస్తే ప్రస్తుతం పార్టీ కార్యక్రమాలకు వినియోగిస్తున్నారని ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ రఘుప్రసాద్, సత్యారెడ్డి, రమేష్‌గౌడ్, ఎంపీటీసీ దామోదర్, మహేందర్‌గౌడ్, వెంకటయ్య, రాజారెడ్డి, విష్ణు, షమీమ్ పాల్గొన్నారు.

వనపర్తి టౌన్: పట్టణంలో అభివృద్ధి మాటున అవినీతి రాజ్యమేలుతోందని ఎంపీపీ మేఘారెడ్డి అన్నారు. టీజేఎస్ నాయకుడు షఫీ నివాసంలో సోమవారం మేఘారెడ్డి మంతనాలు జరిపారు. అవినీతి పాలనను అంతం చేసేందుకు కలిసి రావాలని కోరారు. ఈ మేరకు స్పందించిన షఫీ అధిష్టానం దృష్టికి ప్రతిపాదిత అంశాలను తీసుకెళ్లి తప్పకుండా సహకరిస్తామన్నారు. భావసారూప్యత కలిగిన వ్యక్తులతో దశల వారీగా సంప్రదింపులు జరుపుతున్నట్లు మేఘారెడ్డి తెలిపారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

వీపనగండ్ల: మండలంలోని గోపల్‌దిన్నెలో అనారోగ్యంతో మృతి చెందిన సత్తూరి లక్ష్మీదేవమ్మ కుటుంబానికి వనపర్తి జిల్లా బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బూజాల అనుజ్ఞారెడ్డి రూ.5వేల ఆర్థికసాయాన్ని అందజేసినట్లు జిల్లా కార్యవర్గ సభ్యుడు శివాజీ, బీజేపీ మండల అధ్యక్షుడు రాకేశ్ యాదవ్ తెలిపారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఆవుల నారాయణ, నరేష్, మోహన్‌గౌడ్, మహేష్ యాదవ్, కేశవులు, శ్రీకాంత్, విష్ణు, రాణాప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రానికి చెందిన జంగాల అంజనేయులు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో విషయం తెలుసుకున్న ఎంపీపీ మేఘారెడ్డి రూ.5 వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో అక్కి శ్రీనివాస్‌గౌడ్, రంజిత్‌కుమార్, రాములు, వెంకటేష్‌సాగర్, సురేందర్‌గౌడ్, రాజగౌడ్, సునీల్, నరసింహ,వినయ్, అంజి, దూపం భారతి రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

టార్గెట్ బాల్ క్రీడాకారుడికి..

మండలంలోని కంచిరావుపల్లికి చెందిన ఉమాశంకర్ అంతర్జాతీయ టార్గెట్ బాల్ పోటీలకు ఎంపిక కావడంతో రవాణా ఖర్చుల కోసం సోమవారం మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి రూ. 25 వేల చెక్కును క్రీడాకారుడికి అందజేశారు. బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో నిర్వహించనున్న ఈ పోటీల్లో ఉమాశంకర్ పాల్గొనడంపై మంత్రి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంతో పాటు దేశానికి మంచి పేరు తీసుకరావాలని సూచించారు.

భక్తులతో కిక్కిరిసిన ఆలయాలు

వనపర్తి టౌన్: అధిక శ్రావణానికి ముందు వచ్చే ఆషాడ చుక్కల అమావాస్యను పురస్కరించుకొని సోమవారం జిల్లా కేంద్రంలోని ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. చింతల హనుమాన్ ఆలయంలో ఉదయం నుంచి భక్తులు ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో స్వామివారి ఉత్సవ విగ్రహ ఊరేగింపు ప్రక్రియను భాజాభజంత్రీలతో ఘనంగా చేపట్టడంతో ఆలయ ప్రాంగణం శ్రీరామనామ స్మరణతో మార్మోగింది. ప్రతి అమావాస్య మాదిరిగానే ఆలయ ప్రసాద, అన్నదాన వితరణ కమిటీ ఆధ్వర్యంలో దాతల సహకారంతో అన్నదానం చేపట్టారు. అదేవిధంగా బ్రాహ్మణ వీధిలోని పాండురంగ ఆలయంలో, వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు.

ఘనంగా చౌడేశ్వరి జయంతి ఉత్సవాలు..

చౌడేశ్వరి దేవి జయంతి ఉత్సవాలను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. 108 కలశాలతో అమ్మవారికి అభిషేకం నిర్వహించి జల స్నానాధికాలు జరిపించి అమ్మవారిని ప్రత్యేక అలంకరించారు. వందలాది మంది మహిళలతో సామూహికంగా కుంకుమార్చన, అష్టోత్తర శతనామావళి, లలితా పారాయణం అనంతరం భక్తులకు అమ్మవారి దర్శన భాగ్యాన్ని ఆలయ కమిటీ కల్పించింది. భక్తులు విడివిడిగా అమ్మవారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు.




తూంకుంటలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

వీపనగండ్ల: మండలంలోని తూంకుంటలో వెలిసిన ... మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేయగా సాయంత్రం అమ్మవారి ఉయ్యాల సేవలో భక్తులు ఆనందోత్సవాల మధ్య పాల్గొన్నారు.

ఆత్మకూర్: తొగటవీర క్షత్రియుల ఆరాధ్య దైవం చౌడేశ్వరి అమ్మవారి జయంతి ఉత్సవాలు సోమవారం ప్రముఖ వేదపండితుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. మండలంలోని తిప్పడంపల్లిలో ఉదయం 6గంటల నుంచి మొదలుకొని చౌడేశ్వరి ఆలయంలో జలాభిషేకం, పంచామృతాభిషేకం, సహస్ర కుంకుమార్చన ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేశారు. భజన అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. నిర్వహన కమిటీ అధ్యక్షుడు బలరాం, నాయకులు పెరుమాళ్ల బాలరాజు, సత్యన్న, ఈశ్వరయ్య, పెరుమాళ్ల సత్యన్న ఏర్పాట్లను పర్యవేక్షించారు.



తిప్పడంపల్లిలో..



వనపర్తిలో..

చౌడేశ్వరి అమ్మవారి జయంతిని సోమవారం తొగల సాలె సంఘం సభ్యులు ఘనంగా నిర్వహించారు. చౌడేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, అన్నదానం చేశారు. కల్వరాల, వీపనగండ్ల, సంగినేనిపల్లి, బొల్లారం, తదితర గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు. పూజల్లో రంగయ్య, గురువయ్య, ఈశ్వరయ్య, శ్రీనివాసులు, శివరాములు, సత్యనారాయణ, శివుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనం

ఖిల్లాఘనపురం: మండల కేంద్రంలోని బాదం సరోజాదేవి కల్యాణ మండపంలో మంగళవారం బీఆర్‌ఎస్ పార్టీ ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల అధ్యక్షుడు రాళ్ల కృష్ణయ్య సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. ఉదయం 7 గంటల నుంచి కార్యక్రమాన్ని ప్రారంభమవుతుందని, ఒక్కో గ్రామస్తులతో కనీసం 30 నిమిషాల పాటు ప్రత్యేకంగా మాట్లాడి ఆయా గ్రామాల పరిస్థితి, చేసిన పనులు, చేయాల్సిన పనులు, ప్రజలు కోరుకుంటున్న పథకాలను పూర్తి స్థాయిలో తెలుసుకోవడంతో పాటుగా బీఆర్‌ఎస్ కుటుంబ సభ్యులందరితో కలిసి సహపంక్తి భోజనం ఉంటుందన్నారు. కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని కోరారు.